కొనేదెలా.. తినేదెలా..!



- శ్రావణ మాసం ఆరంభంలోనే ధరల మోత
- ఆకాశాన్నంటిన కూరగాయలు, పూజా సామగ్రి ధరలు
- వినియోగదారుల ఆవేదన



నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయిస్తున్న కూరగాయలు



కొబ్బరికాయలు కొంటున్న వినియోగదారులు



రైతుబజార్‌లో పువ్వుల స్టాల్ వద్ద మహిళలు

సీతంపేట: శ్రావణ మాసం ఆరంభంలోనే కూరగాయలు, పూజా సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల ధరలు చూస్తుంటే కొనకుండానే కన్నీరు తెప్పిస్తున్నాయి. రైతు బజార్లలో నిన్న మొన్నటి వరకు కిలో రూ.20 నుంచి రూ.25 ధరకు లభించిన కూరగాయలు.. నేడు రూ.50 పైమాటే. బహిరంగ మార్కెట్‌లో ఇక చెప్పనక్కరలేదు. పావు కిలో రూ.20 నుంచి రూ.25, కిలో రూ.80 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. రైతుబజారుకు వెళ్తే రెండు మూడొందలకు కూరగాయల సంచి నిండేదని, ఇపుడు రూ.500 పట్టుకెళ్లినా నిండటం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారంలో రెట్టింపైన ధరలు

శ్రావణ మాసంలో ప్రతి ఇంటా మహిళలు వరలక్ష్మీ దేవిని పూజిస్తుంటారు. పూజకు అవసరమైన పువ్వులు, అరటిపళ్లు, కొబ్బరికాయలు, వివిధ రకాల పండ్ల ధరలు అమాంతం పెరిగిపోయాయి. గత వారం రోజుల్లో పూలు, పండ్ల ధరలు రెట్టింపయ్యాయి. శ్రావణ మాసం మొదట్లోనే ధరలు ఇలా ఉంటే వరలక్ష్మీ వ్రతం ఎలా చేయాలని మహిళలు భయపడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నిత్యావసర సరకుల ధరలు 20 నుంచి 30 శాతం పెరిగాయి. మరోపక్క విద్యుత్ చార్జీల పేరిట మోయలేని భారం మోపారు. ఇపుడు కూరగాయల ధరలు ఆకాశాన్నంటడంతో కొనేదెలా.. తినేదెలా.. అంటూ జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల నియంత్రణకు చర్యలేవి?

ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలపై నెలవారీ ఆర్థిక భారం పడుతోందని మహిళలు ఆందోళన చెందుతున్నారు. చివరికి ఆకుకూరల ధరలు కూడా చుక్కలు చూపిస్తున్నాయి. రూ.5కు దొరికే చిన్న కొత్తిమీర రూ.20కు, రూ.10కు మూడు నాలుగు కట్టలు ఇచ్చే తోటకూర, గోంగూర, చుక్క కూర, పాలకూర ఇపుడు రెండు మాత్రమే ఇస్తున్నారు. పెరిగిన ధరలతో శ్రావణ మాసం గడిచేదెలాగని మహిళలు వాపోతున్నారు. కూటమి పాలకులు, అధికారులు స్పందించి నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు తగ్గించి పుణ్యం కట్టుకోవాలని జనం వేడుకుంటున్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరల వివరాలు

కూరగాయలు	నెల కిందట (కిలో రూ.)	ప్రస్తుతం (కిలో రూ.)
పచ్చిమిర్చి	44	60
టమాటాలు	22	48
వంకాయలు	32	42
బెండకాయలు	24	44
కాకరకాయలు	28	32
బీరకాయలు	36	48
క్యాబేజ	20	20
క్యారెట్	34	42
దొండకాయలు	28	42
అల్లం	50	66
బీట్‌రూట్	26	34
వెల్లుల్లి	60	90
దేముడు చిక్కుడు	56	98
గోరుచిక్కుడు	28	40
బరబాటి	32	46
బీన్స్	60	66
ఆగాకర	-	110
పొటల్స్	36	40
పొట్లకాయ	15	24
చిలగదుంపలు	34	44
కంద	54	42
అనపకాయ	16	20
కొబ్బరికాయ(1)	15	30
అరటిపళ్లు(డజన్)	40	60
చామంతి పూలు	350	450
గులాబీలు	250	300

కూరగాయల సంచి నిండటం లేదు



వారం వారం రైతుబజార్‌కు వస్తుంటాను. వారానికి సరిపడా కూరగాయలు కొంటాను. గతంలో రెండు మూడొందలు పెడితే సంచి నిండేది. ఇపుడు రూ.500 పెట్టినా సంచి నిండటం లేదు. టమాటా, అల్లం, వెల్లుల్లి, క్యారెట్, బీట్‌రూట్, చిక్కుడు, వంకాయలన్నీ సగానికి సగం రేట్లు పెరిగాయి. పెరిగిన ధరలతో ఏమి కొనాలో, ఏమి తినాలో తెలియడం లేదు.

– ఎ.భువన, అక్కయ్యపాలెం

ధరలు నియంత్రించాలి



ఇంటో నిత్యం వాడే కంది పప్పు, పెసర పప్పు, మినపప్పు, చింత పండు, మిరపకాయలు ఇలా ఒకటేమిటి నిత్యావసర సరకులన్నీ ధరలు పెరిగాయి. వీటికి తోడు కూరగాయలు, ఆకుకూరలు ధరలు రెట్టింపయ్యాయి. విద్యుత్ చార్జీల భారం మోపారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు పెరిగిన ధరలు భారంగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని ధరలు నియంత్రించాలి.

– ఎండీ బషీర, ఎంటీసీ పాలెం

వర్షాలతో పంట నష్టం



జూన్‌లో కురిసిన వర్షాలకు పంట నష్టం జరిగింది. ఈస్ట్, వెస్ట్, కృష్ణా, ఒడిశా ప్రాంతాల నుంచి నగరానికి కూరగాయాలు ఎక్కువగా దిగుమతి అవుతుంటాయి. వర్షాల కారణంగా పంట లేక దిగుమతులు తగ్గాయి. స్థానికంగా కూరగాయలకు బదులు వరి పంట వేయడంతో లభ్యత తగ్గింది. శ్రావణ మాసం కావడంతో ఎక్కువగా శాఖాహారం తినడంతో కూరగాయలకు డిమాండ్ పెరిగింది.

– కొండబాబు, ఈవో, నరసింహనగర్ రైతుబజార్

క్లుప్తంగా

కె.కె.రాజుకు కృతజ్ఞతలు



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజును సత్కరిస్తున్న సాడి పద్మారెడ్డి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించిన సందర్భంగా కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణిలను పద్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పుష్పగుచ్ఛాలతో వారిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు ఈస్ట్ పార్కులో కరాటేలో శిక్షణ పొందిన విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ సర్టిఫికెట్లు, బెల్ట్‌లు అందజేశారు. కరాటే కోచ్ ఎల్లారావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి రెయ్యి వెంకటరమణ కరాటేలో రాణిస్తున్న విద్యార్థులను అభినందించారు.

పింఛన్ల పంపిణీ



పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సోనియాగాంధీ నగర్‌లో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ కంపా హనోకు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఇటీవల భర్త చనిపోయిన వితంతువులకు నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పైలా ముత్యాలనాయుడు, వాసుపిల్లి రాజు, భరణికాన రాజు, దాసు, పూజారి ఆశీర్వాదం పాల్గొన్నారు.

51వ వార్డులో..

మద్దిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీలో పలువురు లబ్ధిదారులకు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



నిరసన తెలుపుతున్న వామనమూర్తి

సీతంపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద శుక్రవారం చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న గురుద్వారా దరి విద్యుత్ సీఎండీ కార్యాలయం వద్ద కార్మిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలకొట్టండని పిలునిచ్చిన లోకేష్.. నేడు వాటి ఏర్పాటుకు ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల ఖరీదును వినియోగదారులే భరించాలని, వాటి మొత్తాన్ని 93 నెలల బిల్లుతోపాటు అదనంగా చెల్లించాలని తెలిపారు. ప్రజలు విద్యుత్ ఎక్కువగా వాడే సమయాల్లో చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తారని, వేసవిలో ఈ భారం మరింత పెరుగుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల రిపేరు ఖర్చులు కూడా ప్రజలే భరించాల్సి వస్తుందన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

ఇండియన్ ఆయిల్ బంక్స్‌లో ‘ఫ్రీ నైట్రోజన్ ఎయిర్’



సాలగ్రామపురం పెట్రోల్ బంక్‌లో ఫ్రీ ఎయిర్ చాలెంజ్‌ను ప్రారంభిస్తున్న ఐవోసీఎల్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: నగరంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్స్ వద్ద ఫ్రీ ఎయిర్ చాలెంజ్‌కు ఐవోసీఎల్ ప్రతినిధులు శ్రీకారం చుట్టారు. సాలగ్రామపురం హైవే వద్ద గల కోకో పెట్రోల్ బంక్‌లో కంపెనీ అధికారులు శుక్రవారం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టాప్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ల వద్ద మామూలు గాలి మాత్రమే కాకుండా నైట్రోజన్ ఎయిర్‌ని కూడా ఉచితంగా పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. తమ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కంపెనీ ప్రతినిధులు చెప్పారు. ఈ సదుపాయాన్ని అంచెలంచెలుగా మిగిలిన ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్స్‌లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం రిటైల్ సేల్స్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో ‘స్వచ్ఛతా అభియాన్’



రైల్వే స్టేషన్‌లో అధికారులు, రైల్వే సిబ్బంది, స్వచ్ఛ సేవకుల చేత స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో శుక్రవారం స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమం ప్రారంభమైంది. విశాఖ రైల్వే స్టేషన్‌లో ఈ కార్యక్రమాన్ని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ప్రారంభించి మాట్లాడారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం, సమర్థవంతంగా చెత్త తరలించడం, ప్రజల్లో అవగాహన కల్పించడం స్వచ్ఛతా అభియాన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రైల్వే పరిసర ప్రాంతాలను ప్లాస్టిక్, చెత్త, వ్యర్థాల రహితంగా ఉంచడమే లక్ష్యమన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగులు, సిబ్బంది, పారిశుధ్య సేవకులు, ప్రయాణికుల చేత డీఆర్‌ఎం స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. రైల్వేస్టేషన్ పరిసరాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 15 వరకు స్వచ్ఛతా అభియాన్ కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు తెలిపారు. వాల్తేర్ డివిజన్‌లోని శ్రీకాకుళం రోడ్, విజయనగరం, రాయగడ, కోరాపుట్, జగదల్‌పూర్, కిరండూల్, అరకు, సింహాచలం, దువ్వాడ రైల్వే స్టేషన్లు, ఎలక్ట్రికల్ లోకోషెడ్, డీజిల్ లోకోషెడ్, కోచ్ కేర్ సెంటర్, ఇతర అన్ని విభాగాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారన్నారు. పర్యావరణం, హౌస్ కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగం పలు ఆకస్మిక పారిశుధ్య డ్రైవ్‌లు నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) ఇ.శాంతారాం, సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్, ఎన్విరాన్‌మెంట్ కం హౌస్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ప్రవీణ్ భటి, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మీ నమోస్తుతే..

- ఘనంగా రెండో శుక్రవారం పూజలు



ఎరుకుమాంబకు తొలి పూజ చేస్తున్న ఆలయ ఈవో రమాభాయి



లలితా పీఠంలో పసుపు కొమ్ముల అలంకరణలో పద్మావతీ దేవి



ఎరుకుమాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సీతంపేట: శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి మహిళలు ఘనంగా పూజలు చేశారు. లలితానగర్‌లోని లలితా పీఠంలో లలితాదేవి, పద్మావతి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవార్ల దర్శనానికి ఉదయం, సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. లలితా అమ్మవారికి, పద్మావతికి ఉదయం అభిషేకం, సాయంత్రం కుంకుమ పూజలు జరిపారు. అనంతరం సహస్ర నామార్చన, ఖడ్గ మాల, త్రిశతి, అష్టోత్తర పూజలు చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో లలితాదేవి, పసుపు కొమ్ముల అలంకరణలో పద్మావతీ దేవి భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎరుకుమాంబకు కుంకుమ పూజలు

దొండపర్తి ఎరుకుమాంబ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో జి.వి.రమాభాయి అమ్మవారికి తొలి పూజ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, 104 ఏరియాల్లోని ఆలయాల్లో శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. దుర్గానగర్ దుర్గాలయంలో, బాపూజీనగర్ మహాలక్ష్మీదేవి ఆలయంలో, పార్వతీశ్వరాలయంలో వరలక్ష్మీ దేవికి ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, సూర్యప్రకాష్ శర్మ, శ్రీనివాసశర్మ నేతృత్వంలో అభిషేకాలు, పుష్పార్చనలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయాల కమిటీ సభ్యులు, సేవకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు విశేష పూజలు

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన ఉమాదేవి ఆలయంలో అమ్మవారిని రకరకాల పండ్లు, డ్రై ఫ్రూట్స్‌తో అర్చకుడు భార్గవశర్మ ఆధ్వర్యంలో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. నీలమ్మవేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో విశేష పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకుడు జోగారావుశర్మ చేపట్టారు. అల్లిపురం అలమేలు మంగమ్మ ఆలయం, మూడుగుళ్ల కనకదుర్గమ్మ ఆలయం, కెప్టెన్ రామారావు జంక్షన్ రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం, జెండాచెట్టు వీధి విజయదుర్గాలమ్మ, యారాడ కొండపై వెలసిన సాగరగిరి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి విశేష పూజలు నిర్వహించారు.



కంచరపాలెంలో దుర్గాదేవి



బాపూజీనగర్‌లో అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కామన్ రూల్స్ విస్మరించడం అన్యాయం

- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం కామన్ రూల్స్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ జూనియర్లకు ఎంఈవోలుగా బాధ్యతలు కట్టబెట్టడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీతో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.వి.విశ్వనాథం మాట్లాడుతూ గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ పాఠశాలలో పనిచేసే స్కూల్ అసిస్టెంట్లకు, హెడ్ మాస్టర్లకు ఎంఈవోలుగా బాధ్యతలు కట్టబెట్టడం లక్షలాది మంది సీనియర్లయిన జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయులకు అన్యాయం చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్, మున్సిపల్ స్కూల్స్ ఉపాధ్యాయులను విస్మరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. ఈ అన్యాయాన్ని గట్టిగా ఎదుర్కోడానికి ఆపస్, పీఆర్టీయూ రాష్ట్ర నాయకత్వాలు ఇచ్చిన ఉమ్మడి పిలుపు మేరకు నిరసన చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శ్యామల, వై.రామలక్ష్మి, రమణశ్రీ, ప్రభాకర్, రత్నం, పుష్పలత పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం



వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో జిమ్ పరికరాలను ప్రారంభిస్తున్న సీఐ రవికుమార్

సీతంపేట: నిత్యజీవనం దినచర్యలో వ్యాయామాన్ని భాగం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ అన్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను, స్విమ్మింగ్ పూల్‌లో లైటింగ్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, కమిటీ సభ్యులు సుధాకర్, రోణంకి నాగేశ్వరరావు, సురేష్, పొందూరు సూర్యనారాయణ, వాకర్స్ ప్రతినిధులు సిహెచ్.శ్రీనివాసరాజు, వంశీ చింతలపాటి, వనిత సభ్యులు పాల్గొన్నారు.

ఎంఈవోలుగా అందరికీ అవకాశమివ్వాలి



డీఈవో ప్రేమకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఎంఈవో 1 పోస్టులకు నియామకాలు చేపట్టేటప్పుడు అన్ని పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లకు అవకాశం కల్పించాలని పీఆర్టీయూ, ఆపస్ సంఘాల ఉపాధ్యాయులు డీఈవో ఎన్.ప్రేమకుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు మాత్రమే ఎంఈవో 1గా నియమించడానికి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను వెనక్కు తీసుకోవాలని కోరారు. ఇది ఉమ్మడి సర్వీస్ రూల్‌కు విఘాతం కల్పించడమేనని తెలిపారు. దీనికి నిరసనగా నల్ల బ్యాడ్జీలతో జిల్లాలోని పాఠశాలల్లో చెక్‌డౌన్ చేపట్టినట్లు తెలిపారు. ఒకే డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు కామన్ సీనియారిటీ ప్రాతిపదికన మండల విద్యాధికారులుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మద్దు శ్రీను, నాగేశ్వరరావు, అరుణ్ కుమార్, విశ్వనాథ, సన్యాసినాయుడు, సుదర్శన్ పట్నాయక్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.